క్లుప్తంగా

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



కృత్తివెన్ను: అమ్మవారి ఆలయాల్లో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని పెన్నమ్మ దిబ్బలో పెన్నమ్మతల్లి, పీతలావ సమీపంలోని గంగానమ్మతల్లి ఆలయాల్లో కాగిత ఆయన భార్య శిరీషతో కలసి పూజలు జరిపారు. అమ్మవార్లకు పసుపు కుంకుమతో పాటు వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైభవంగా ముగిసిన పవిత్రోత్సవాలు



బంటుమిల్లి: స్థానిక పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిసారిగా నాలుగు రోజులుగా జరుగుతున్న స్వామివారి పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం పండితుల వేద మంత్రాల మధ్య దీక్ష దంపతులతో పుణ్యాహవచనం, విష్వక్సేన పూజ అనంతరం హోమాలకు పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలు ప్రాంతాలకు చెందిన దంపతులకు దీక్షధారణ చేసి కల్యాణ అక్షితలు పోయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఎస్.రాజ, వి.బాబు, యూపీఆర్ విఠల్, సీహెచ్. రాధకృష్ణ, వి.కుమార్, జె.శరభయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల సందడి



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవాలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారు జామునుంచే తెలుగు ఉభయ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గంగానమ్మ జాతర



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో శ్రీగంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గౌడ, రజక సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు కనక డప్పులతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతర నిర్వహించారు.

నాంచారమ్మకు జలాభిషేకం

విశ్వనాథపల్లిలో శ్రావణమాస పూజలు



కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ వారికి ఆదివారం వేలాది బిందెల నీటితో అభిషేకాలు చేశారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మూలమూర్తికి పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం 108 బిందెలతో కృష్ణమ్మ నీటిని ఆలయం చుట్టూ ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ నీటితో అమ్మవారికి అభిషేకించారు. అనంతరం భక్తులే స్వయంగా అభిషేకాలు చేసేందుకు అవకాశం కల్పించారు. అమ్మవారి పుట్టింటివారిగా చెప్పబడే గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభిషేకాల్లో పాల్గొన్నారు. నాంచారమ్మ మూలమూర్తికి చందనంతో చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ప్రధానార్చకుడు ఘంటసాల పార్థసారధి పూజలు చేయగా, ఈఓ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీరు అందదు.. సాగు సాగదు

'కృష్ణా జిల్లా కోడూరు మండలం పిట్టల్లంకకు చెందిన బాబూరావు అనే రైతు రెండెకరాల్లో నాట్లు వేయించేందుకు ఆయిల్ ఇంజిన్‌తో సాగునీరు తోడి దమ్ము చేయించాడు. రెండో రోజు వచ్చి చూస్తే పొలంలో చుక్కనీరు లేదు. ఆ రోజు సాగునీరు అందక పోవడం వల్ల నీరు పెట్టలేకపోయాడు. మూడోరోజు దమ్ముచేసిన పొలం ఎండిపోయి బెట్టకొట్టింది. ఇందుకోసం ఆయనకు రూ.3,500 ఖర్చులు అయ్యాయి. మరోసారి నీరు తోడి దమ్ముచేస్తేనే నాట్లు పడతాయి. సాగునీరందక పోతే మరోసారి ఇలాగే చేయాల్సి వస్తుంది' అవనిగడ్డ నియోజకవర్గంలోని చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

–అవనిగడ్డ



నారేపాలెంలో పంటకాలువ పక్కన ఇంజిన్ ద్వారా పొలానికి సాగునీరు



కోడూరు మండలం నారేపాలెం వద్ద దమ్ముచేసి నీరు లేక ఎండిపోయిన పొలం

- దివిసీమలో ఆలస్యమవుతున్న వరినాట్లు
- దిగువ ప్రాంతాల్లో ఇంజిన్లకు కూడా అందని సాగునీరు
- అర్ధరాత్రిళ్లలో పొలాల్లో రైతుల పడిగాపులు
- స్పందించేవారికోసం రైతుల ఎదురుచూపులు

అయిల్ ఇంజిన్లు వాడినా..

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఏటా 98 వేల ఎకరాలకు పైగా వరిసాగు జరుగుతుంది. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో 65 శాతం వరినాట్లు పూర్తికాగా, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో ఇంకా 30 శాతం కూడా పూర్తికాలేదు. కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక, మోపిదేవి మండలాల్లోని దిగువ ప్రాంతాల్లో ఆయిల్ ఇంజిన్లు లేనిదే నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. ఒకటి రెండు రోజులు ఇంజిన్లతో నీరు తోడి దమ్ము చేయించిన పొలాలు మరుసటి రోజు చూస్తే పొలంలో నీరు ఇంకిపోయి ఎండిపోయి బెట్ట కొడుతుందని కొంతమంది రైతులు చెప్పారు. దీని వల్ల మరోసారి దమ్ము చేయించడం, మళ్లీ నీరు తోడటం వల్ల ఎకరాకు రూ.3 నుంచి రూ.4 వేలు ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కారణాలు ఇవీ..

ఈ సంవత్సరం జూలై 18వ తేదీన పంటకాలువలకు సాగునీటిని విడుదల చేశారు. ఆ సమయంలో తాగునీటి అవసరాల కోసం మంచినీటి చెరువులు నింపుకునేందుకు వీటిని ఉపయోగించాలని అధికారులు చెప్పడంతో రైతులు నారు మళ్ల పోసుకోలేదు. ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 4,68,560 క్యూసెక్కులు నీటిని వృథాగా సముద్రంలోకి వదిలేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సాగునీటి అవసరాల కోసం కేఈబీ కెనాల్‌కు రోజుకు 1,200 క్యూసెక్కులు విడుదల చేస్తే కాలువలు ఫుల్ అవుతాయి. ముందుగా సరైన ప్రకటన చేయక పోవడం, కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు వదలకుండా సముద్రంలోకి వృథాగా సాగునీరు వదలడం పట్ల రైతులు మండిపడుతున్నారు. సకాలంలో సాగునీరు విడుదల చేయక పోవడం, వర్షాలు పడక పోవడంతో ఇప్పటికే మూడు వారాలు వరి నాట్లు ఆలస్యం అయ్యాయి.

రాత్రీ, పగలు పడిగాపులు..

పగలంతా ఇంజిన్లతో నీటిని తోడటం వల్ల దిగువ ప్రాంతాలకు నీరు పారక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ఇంజిన్లు ఆడించటం ఆపేస్తారు. దీంతో కొంతమంది రైతులు కాలువల ద్వారా సాగునీరు పెట్టుకునేందుకు రాత్రిళ్లు పొలాల్లో పడిగాపులు కాస్తున్నారు. 2007, 08 సంవత్సరాల్లో సాగునీటి కోసం ఇలాగే కష్టాలు పడ్డామని, మళ్లీ ఆ పాత రోజులే పునరావృతం అవుతున్నాయని, కొంతమంది రైతులు గుర్తుచేసుకుంటున్నారు.

పంట కాలువల్లో నీటిమట్టం లేకే..

పంటకాలువ ద్వారా సక్రమంగా సాగునీరందడం లేదు. సరైన వర్షాలూ లేవు. ఇంజిన్లు ఉన్న రైతులు రాత్రీ, పగలు నీటిని తోడుకుని నాట్లు వేసుకుంటున్నారు. వర్షాలు లేకపోతే కాలువ నుంచి సరఫరా అయ్యే సాగునీరు సరిపోక నాట్లు వేయలేమని కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి మండలాల దిగువ ప్రాంత రైతులు చెప్పారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..

సాగు ఆలస్యం అయితే రెండో పంట అపరాల దిగుబడులు రావని, అపరాల మీద ఆశ పెట్టుకుని కౌలుకు చేస్తున్నామని కొంతమంది కౌలురైతులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పంటకాలువలకు పూర్తి స్థాయిలో సాగునీరు వదలాలని దివిసీమ రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

ఇప్పటికే 20 రోజులు ఆలస్యం..



ప్రతి సంవత్సరం ఆగస్టు ఐదవ తేదీలోపు నాట్లు వేసేవాళ్ళం. మాకొచ్చే కాలువకు ఇంజన్‌లకు సాగునీరు అందడం లేదు. పైనున్న రైతులు ఆయిల్ ఇంజన్లు పెట్టడం వల్ల మాకు సాగునీరు రావడం లేదు. నాట్లు ఆలస్యం అయితే రెండో పంట మినుము దిగుబడులు తగ్గిపోతాయి.

–పోలాబత్తిన వెంకటేశ్వరరావు, పిట్టల్లంక, కోడూరు మండలం

నాట్లు ఎప్పుడు పడతాయో..



నిన్నటి వరకూ సముద్రంలోకి వృథాగా సాగునీరు వదిలేశారు. ఇప్పుడేమో పంట కాలువలకు సరిపడా నీరు వదలడం లేదు. సాగునీరందక, వర్షాలు లేక పోవడం వల్ల నాట్లు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సాగునీరు వదలాలి.

–చిరివేళ్ల యానాదిరావు, పిట్టల్లంక

అనుమతి లేని కట్టడం తొలగింపు



అక్రమ కట్టడం తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటరామయ్య

పెడన: పట్టణ శివారు గుడివాడ రోడ్డులోని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో అనుమతులు లేకుండా రాత్రి రాత్రి అక్రమ భవన కట్టడం వెలిసింది. ఆదివారం ఉదయం మున్సిపల్ సిబ్బంది గుర్తించి కమిషనర్ బి. వెంకటరామయ్యకు సమాచారం ఇవ్వడంతో కట్టడాన్ని పరిశీలించి అనుమతులపై ఆరా తీశారు. ఎటువంటి అనుమతులు లేవని పేర్కొవడంతో ఆ కట్టడాన్ని తక్షణం తొలగించాలని, లేని పక్షంలో మున్సిపల్ పొక్లయిన్‌తో తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో కట్టడాన్ని నిర్మించుకున్న వారే తమ కట్టడాన్ని తొలగించుకున్నారు. కట్టడాన్ని పూర్తిగా తొలగించే వరకు కూడా కమిషనర్, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎవరైనా తమ సొంత స్థలాల్లో నిర్మాణాలు చేపట్టదలచిన వారు ముందుగా పురపాలక సంఘం నుంచి అనుమతులు పొందాల్సిందేనని స్పష్టం చేశారు. అలా అనుమతులు లేకుండా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా శాఖాపరమైన చర్యలకు గురికావాల్సి ఉంటుందని తెలిపారు.

233 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



ల్యాబ్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డీఎస్పీ దుర్గారావు, సంస్థ చైర్మన్ సురేష్

చల్లపల్లి(అవనిగడ్డ): ఇండి విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ఆధ్వర్యంలో 233 మంది పేద విద్యార్థులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ల్యాప్‌ట్యాప్‌లు, స్కాలర్‌షిప్‌లను అందించారు. చల్లపల్లి మండల పరిధిలోని వక్కలగడ్డ ఐవీఎం కార్యాలయం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఐవీఎం సంస్థ ద్వారా వేములపల్లి సురేష్–రోజా దంపతులు గత 23 సంవత్సరాల నుంచి పేద విద్యార్థులకు ఉచిత వసతి, విద్య అందిస్తున్నారని చెప్పారు. సంస్థ చైర్మన్ సురేష్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వందలాది మంది విద్యార్థులను గ్రాడ్యుయేట్లుగా తయారు చేశామన్నారు. 94 మంది పేదలకు ప్రతినెలా సరుకులు, వస్త్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. కాకినాడ ఇంటిలిజెన్స్ డీఎస్పీ ఎస్ఎస్‌వీకే దుర్గారావు, జనసేన యువనేత మండలి వెంకట్రామ్ (రాజా), ఐవీఎం బోర్డు సభ్యులు ఎస్ ఫణి, జి.ప్రసాద్, రిటైర్డ్ డీఎస్పీ కె. హరిరాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, వైఎస్ ప్రెసిడెంట్ ముమ్మనేని నాని, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'13 మంది అక్రమ పింఛనుదారులను గుర్తించాం'



మోపిదేవి గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిరాజ్

మోపిదేవి: అర్హత లేని 13 మంది వివిధ కళాకారులు పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించామని ఎస్ఆర్ ఈజీఎస్ డీఆర్వో సత్తిరాజ్ తెలిపారు. మండల పరిధిలోని మోపిదేవి, పెదకళ్లేపల్లి, కోసూరువారిపాలెం, ఉత్తరచిరువోలులంక, మోపిదేవిలంక గ్రామాల్లో ఉపాధి పనులు, సామాజిక పింఛన్లపై ఆదివారం ఆడిట్ గ్రామ సభ నిర్వహించారు. మోపిదేవి గ్రామ సభలో డీఆర్వో మాట్లాడుతూ తమ ఆడిట్‌లో 12 మంది చర్మకారులు, ఒకరు డప్పు కళాకారులు పింఛన్లకు అనర్హులుగా గుర్తించినట్లు గ్రామ సభలో చదివి వినిపించారు. హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో 26 పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. లే అవుట్స్‌లో ఆరుగురికి స్థలాలు కేటాయించగా మరో లే అవుట్స్‌లో మంజూరైన మూడు పేర్లను కూడా ఇదే లే అవుట్‌లో నిర్మించడం వల్ల మొత్తం 9 మందికి ఇళ్ల నిర్మాణం జరిగినట్లు వివరించారు. ఎంపీటీసీ కొమ్ము పవన్ కుమార్, ఏపీఓ రవి కుమార్ పాల్గొన్నారు.

హంసలదీవి బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: కోడూరు మండలం హంసలదీవి వద్ద సముద్ర స్నానానికి వెళ్లి నీటిలో మునిగి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆసిఫ్ కౌసర్, షేక్ ఆఫ్రిన్, షేక్ కరీంను ఎమ్మెల్యే పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి వారికి అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సముద్రస్నానానికి వెళ్లి ఒకరు మరణించడం, మరొకరు గల్లంతవడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. గల్లంతైన ముషారఫ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హైవే ప్రయాణమంటే హడల్

- హైవేపై ప్రమాదాలు నిత్యకృత్యం
- డివైడర్ లేకపోవడమే కారణమంటున్న ప్రజలు



హైవే మీద గ్రామాలలో పోలీసులు ఏర్పాటు చేసిన డ్రమ్ములు

కృత్తివెన్ను: జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. పెడన నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల మీదుగా 216ఏ జాతీయ రహదారి దాదాపు 44 కిలోమీటర్ల మేర విస్తరించి పశ్చిమగోదావరి జిల్లాలో కలుస్తుంది. కృత్తివెన్ను మండలంలోని పల్లెపాలెం వద్ద నుంచి పెడన వరకు జాతీయ రహదారి ఉంది. ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువయ్యాయి.

కారణాలివీ..

పెడన మండలంలోని నందమూరు, కృత్తివెన్ను మండలంలో గాంధీనగరం, అడ్డపర్ర, సీతనపల్లి, ఒంటిళ్లు, గరిశపూడి, లక్ష్మీపురం, పల్లెపాలెం గ్రామాల మీదుగా జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. దీంతో స్థానిక ప్రజల్లో రహదారిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం రెండు లైన్ల రహదారి కావడం, వాహనాల రద్దీ అధికంగా ఉండటం డివైడర్ లేకపోవడమేనని పరిశీలకులు భావిస్తున్నారు.

మితిమీరిన వేగం..



కృత్తివెన్ను సమీపంలో వాహనాలు ఢీకొన్న ఘటనలో ధ్వంసమైన కారు (ఫైల్)

రహదారిపై ప్రయాణించే వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లడం ప్రమాదాలకు ఎక్కువ కారణంగా కనిపిస్తోంది. ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా కార్లు పల్టీలు కొట్టడం, ఎదురెదురుగా ఢీకొట్టుకోవడం ఎక్కువైంది. కృత్తివెన్ను మండల ప్రాంతంలో ఏడాదిలోపు దాదాపు 20కి పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారిపై ఎక్కువగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు సాధ్యమైనంత మేర డివైడర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించ వచ్చనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

అవగాహన కల్పిస్తున్నాం..



సమస్యపై హైవే అధికారులకు నివేదిస్తాం. జాతీయ రహదారిపై ఎక్కువగా ట్రాఫిక్ కంట్రోల్ కొరకు స్టాఫ్‌లను ఏర్పాటు చేశాం. గ్రామాల వద్ద డ్రమ్ములు ఏర్పాటు చేయడంతో పాటు దాతల సహకారంతో సీసీ కెమేరాలు కూడా పెట్టించాం. వాహనదారులకు, స్థానిక ప్రజలకు ప్రమాదాలపై, రోడ్డుపై సంచరించే సమయంలోనూ హైవే నిబంధనలకు అనుగుణంగా ఎలా మసలు కోవాలో అవగాహన కల్పిస్తున్నాం.

–ఏ.పైడిబాబు, ఎస్ఐ, కృత్తివెన్ను

269 మందికి ఉచిత రక్త పరీక్షలు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద వాకర్స్‌కు ఈ పరీక్షలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షుడు ఎం.శివ రామకృష్ణ తెలిపారు. మొత్తం 296 మంది నుంచి రక్తన మూనాలు సేకరించామని పేర్కొన్నారు. వీటిని భాగ్యలక్ష్మి రక్త పరీక్ష కేంద్రానికి పంపి ఫలితాలను వాకర్స్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కొమరవోలు రామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి శ్రావణ పూజలు

నాగాయలంక: శ్రావణ మాస పర్వతిథులు పురస్కరించుకుని నాగాయలంకలోని పురాతనమైన శ్రీవల్లీ శ్రీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగాన్ని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ప్రత్యేక అలంకారం జరిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించిన తదుపరి భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

వైభవంగా లోహ విగ్రహాల భావ ప్రతిష్ట

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): స్థానిక రామాలయంలో శ్రావణ ఆదివారం శ్రీహనుమాన్ శ్రీలక్ష్మణ సమేత శ్రీసీతా రామచంద్రుల నూతన లోహ విగ్రహాల భావప్రతిష్ఠ వైభవంగా జరిగింది. స్థానిక గ్రామ భక్తసమాజం, గ్రామ సర్పంచి తలశిల అర్జునరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సబ్బినేని వెంకట సత్యనారాయణమూర్తి, కృష్ణకిరణ్ దంపతులు రూ.లక్షకు పైగా వితరణతో స్వామివార్ల ఇత్తడి లోహ విగ్రహాలను సమర్పించారు. ఆరేమండ కళ్యాణ చక్రవర్తి (నల్లూరు) బ్రహ్మత్వంలో ఉదయం గం.8.49లకు విగ్రహాల భావ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నసంతర్పణ జరిపారు. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన తూనుగుంట్ల మాధవి నేతృత్వంలో మహాలక్ష్మి భక్త సమాజం సభ్యులు భజన, భక్తిగీతాలపన, శ్రీకృష్ణ కోలాట సమితి బృందంచే కోలాట ప్రదర్శన జరిగాయి. ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని బొడ్డపాడులో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఎస్ఐ ఎం. అర్జునరాజు ఆదివారం పోలీసు సిబ్బందితో దాడి చేశారు. 12 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.16,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం పోటీపడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలో వేచియుండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద గోశాల వద్ద మహిళలు పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అడ్డాడ(పామర్రు): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణమూర్తి పేర్కొన్నారు. పామర్రు మండలం అడ్డాడ గ్రామంలోని అరవింద స్కూల్లో విజేతలను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 బాలికల కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి బహుమతులను సాధించారన్నారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో గుంటూరు జిల్లా నూతక్కిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్.పవన్‌కుమార్, బి.కవిత పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని లింగవరం గ్రామం వద్ద వాహన తనిఖీలను ఆదివారం సాయంత్రం చేపట్టారు. వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్‌లు లేని వారికి అపరాధ రుసుం విధించారు.